క్లుప్తంగా

హుండీ ఆదాయం లెక్కింపు

కూసుమంచి: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని కూసుమంచిలోని శివాలయానికి రూ.3,59,190 ఆదాయం సమకూరింది. హుండీ ద్వారా రూ.1,28,540 ఆదాయం రాగా టికెట్లు, అర్చన, అభిషేకాలు, కట్నకానుకల ద్వారా మరో రూ.2,30,650 ఆదాయం సమకూరింది. హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయశాఖ భద్రాచలం డివిజన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఈఓ కాముని శ్రీకాంత్, అర్చకులు శేషగిరి శర్మ తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు వితరణ

ఖమ్మంఅర్బన్: నగరంలోని గొల్లగూడెం ఓం శ్రీకృష్ణ గోశాల సొసైటీకి గోశాలలోని గోవుల పశుగ్రాసం కోసం దాతలు రూ.8,111లను బుధవారం వితరణ చేశారు. పశువులకు గ్రాసం కోసం సీహెచ్.రమేష్–కళ దంపతులు తమ వంతుగా ఆర్థిక సాయం అందించినట్లు సొసైటీ బాధ్యుడు కేశా హనుమంతురావు తెలిపారు.

తమ్మినేని పరామర్శ

ఖమ్మంరూరల్: మండలంలోని తెల్దారుపల్లికి చెందిన ప్రముఖ న్యాయవాది మర్రి కృష్ణమూర్తి మృతి చెందగా ఆయన కుటుంబాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం బుధవారం పరామర్శించారు. ఆయన వెంట నాయకులు సిద్ధినేని కోటయ్య, అప్పారావు, నాగమ్మ, భాస్కర్‌రావు, మధు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈకి అభినందనలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం జలవనరుల శాఖ ఎస్ఈగా పూర్తి బాధ్యతలు తీసుకున్న మంగళపూడి వెంకటేశ్వరరావును బుధవారం టీఎన్జీవోస్ నేతలు కలిసి అభినందనలు తెలిపారు. పాలేరు ఈఈగా ఉన్న వెంకటేశ్వరరావుకు ఇటీవల ఎస్ఈ బాధ్యతలు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ ఖమ్మం జిల్లా కో కన్వీనర్ శ్రీ కొణిదన శ్రీనివాస్‌తో పాటు పలువురు ఇరిగేషన్ ఇంజనీర్లు, ఉద్యోగులు కలిసి అభినందనలు తెలిపారు.

చెక్కుల పంపిణీ

ఖమ్మంఅర్బన్: నగరంలోని 8వ డివిజన్‌లోని బాధితులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసు మేరకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం కార్పొరేటర్ లకావత్ సైదులు ఆధ్వర్యాన ఇంటింటికి వెళ్లి అందించారు. ఇందులో ఖాజామియాకు రూ.36 వేలు, కందిమల్ల నిర్మలకు రూ.60వేలు అందించినట్లు కార్పొరేటర్ తెలిపారు.

ఆరోగ్యకర జీవితానికి కృషి

ఖమ్మంఅర్బన్: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఆరోగ్యవంతమైన జీవితం అందించేందుకు తన వంతు కృషి చేస్తానని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ(సీడబ్ల్యూసీ) చైర్‌పర్సన్ భారణిరాణి అన్నారు. బుధవారం నగరంలోని ఇందిరానగర్, రిక్కాబజార్ ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి అంతర్జాతీయ పిల్లల దినోత్సవం సందర్భంగా విద్యార్థులచే ఆమె ప్రతిజ్ఞ చేపించాక మాట్లాడారు. ఇందిరానగర్ హెచ్ఎం మంజుల , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో సమస్యల పరిష్కారానికి..

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం బైపాస్‌లోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో సమస్యలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తనయుడు డాక్టర్ యుగంధర్ తెలిపారు. మార్కెట్‌ను బుధవారం ఆయన పరిశీలించగా, ఏళ్లుగా పడావు పడిన రిఫైనరీ చాంబర్ విషయాన్ని వ్యాపారులు వివరించారు. ఈ సమస్యతో పాటు పార్కింగ్ అంశంపై స్పందించిన ఆయన పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. మార్కెట్ ఉద్యోగులు ప్రవీణ్‌రెడ్డి, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

‘న్యూవిజన్’లో సంస్కృతి మహోత్సవం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని న్యూవిజన్ పాఠశాలలో సంస్కృతి మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించినట్లు అకాడమిక్ డైరెక్టర్ సీహెచ్.కార్తీక్ తెలిపారు. బుధవారం విద్యార్థులు వివిధ రాష్ట్రాల వేషధారణ, సంస్కృతిని ప్రతిబింబించేలా కార్యక్రమాల్లో పాల్గొన్నారన్నారు. ప్రైమరీ హెచ్ఎం మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే శ్రీకృష్ణసాయి ఆశ్రమం నగరస్థాయిలో పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో తమ విద్యార్థులు టి.భావన, శ్రీలేఖ, లక్ష్మీప్రసన్న ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ అబాద్ అలీ, ఉపాధ్యాయుడు సతీష్ పాల్గొన్నారు.

అలరించిన సంఘం, శరణం గచ్ఛామి నాటిక

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో బుధవారం రాత్రి అంబేద్కర్ జీవిత చరిత్రపై హైదరాబాద్ అభ్యుదయ ఆశ అకాడమీ కళాకారులు ప్రదర్శించిన సంఘం చరణం, గచ్ఛామి నాటిక ప్రేక్షకులను అలరించింది. అంబేద్కర్ పుట్టుక, విద్యాభ్యాసం, ఆయన అణిచివేతకు గురైన ఘట్టాలతో కూడిన ప్రదర్శన ఆకట్టుకుంది. నిర్వాహకులు తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ గోపీనాథ్, క్లైమెంట్, జగదీష్, బాబు రత్నాకర్, డాక్టర్ స్వర్ణకుమారి, ఎల్లయ్య, బందెల నాగలక్ష్మి, ముత్తమాల ప్రసాద్, నందిపాటి మనోహర్, ఎస్.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వికృత వనాలు..!



కోనాయిగూడెంలో పల్లె ప్రకృతి వనం దుస్థితి

అడవిని తలపిస్తున్న ప్రకృతి వనాలు

- బోర్డులకే పరిమితమైన వైనం
- నిర్వహణ లేమితో రూ.కోట్లు వృథా
- దృష్టిసారించని అధికార యంత్రాంగం

గ్రామాల్లో పచ్చటి మొక్కలు, రంగురంగుల పూలతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేలా గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం వాటి నిర్వహణను గ్రామీణాభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్ విభాగం మధ్య సమన్వయం లేకపోవడంతో అవి అడవిని తలపిస్తున్నాయి. కోట్ల రూపాయిలు ఖర్చు చేసినా ఫలితం లేకుండాపోతోంది. మరికొన్ని చోట్ల కనీసం తాళాలు కూడా తీయని పరిస్థితి నెలకొంది.ఇవి కేవలం బోర్డులకే పరిమితమయ్యాయి.

నేలకొండపల్లి: ఖమ్మం జిల్లాలో 589 గ్రామపంచాయతీలలో గత ప్రభుత్వం 2020లో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. అందులో వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలను నాటడంతో పాటు ప్రజల కోసం వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేశారు. అయితే ఒక్కో పల్లె ప్రకృతి వనాల కోసం దాదారు రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చు చేశారు. వనాల కోసం జిల్లా వ్యాప్తంగా రూ.కోట్లు వెచ్చించగా.. నాటి పాలకవర్గాల సర్పంచ్‌లు ఏర్పాట్లలో జాప్యం చేసిన వారికి నోటీసులు జారీ చేయడంతో పాటు కొంతమందిని సస్పెండ్ కూడా చేశారు.

అంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రకృతి వనాలు ఇప్పుడు వికృత వనాలుగా మారాయి. ఎక్కడా వినియోగంలో లేకుండా పోయాయి. ఇక పంచాయతీ అధికారులు అవి ఉన్నట్లుగా గుర్తు లేనంతగా వదిలేశారు.

ఆచరణ శూన్యం..

గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల కోసం ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో పాటు పంచాయతీ నిధులను వినియోగించారు. ఇందులో మండలంలోని అనాసాగారం గ్రామ పంచాయతీలో రూ.6.35 లక్షలు, కోనాయిగూడెంలో రూ.3.38 లక్షలు కేటాయిస్తూ ఒక్కో పంచాయతీలో ఒక్కో తీరుగా రూ.కోట్లు ఖర్చు చేశారు. ఏపుగా పెరిగిన మొక్కలతో బోర్డులు కనిపించకపోవడం, నాటిన మొక్కల్లో బతికినవి ఎన్ని, అందులో వేసిన ట్రాక్ ఏమైంది ఇలా అనేక ప్రశ్నలు వస్తున్నాయి. ఇవి కొన్నిచోట్ల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారిందని ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.

అంతు చిక్కని లెక్కలు..

వనాలకు అయిన ఖర్చు లెక్కలు ఎవరికీ అంతు చిక్కడం లేదు. ఇకనైనా సంబంధిత అధికారులు పట్టించుకోకపోతే రూ.కోట్ల నిధులు చెత్తపాలవుతాయని పలువురు విమర్శిస్తున్నారు.



సదాశివాపురంలో తాళం తీయని వనం

వనాలపై అధికారులు పర్యవేక్షణ పూర్తిగా మరిచిపోయారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు కూడా వనాల వైపు చూడడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొద్ది పంచాయతీల్లో తప్ప మిగతా లన్ని వనాల వికృతంగా కనిపిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం వనాలకు శాపంగా మారిందని పలువురు పేర్కొంటున్నారు. వనాలపై పెట్టిన ఖర్చును సైతం నిగ్గు తెల్చాల్సిన అవసరం ఉంది.

అధికారులు పట్టించుకోవాలి..



పల్లె ప్రకృతి వనాలను అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి వచ్చింది. స్థానిక పంచాయతీ కార్యదర్శులు కూడా పట్టించుకోవడం లేదంటే ఎంత నిర్లక్ష్యం ఉందో అర్థం చేసుకోవచ్చు. ట్రాక్‌ను వినియోగించుకునే పరిస్థితి లేదు.

– పి.శ్రీనివాస్, నేలకొండపల్లి

ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చాలి..



ప్రజలకు ఆరోగ్యంపై భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం గాలికొదిలేయడం సరికాదు. ప్రభుత్వం లక్ష్యం నెరవేరేలా చూడాలి. అలాగే నిధుల వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టాలి.

– పొగర్తి సుధాకర్, కొత్తకొత్తూరు

దృష్టి సారిస్తాం..



గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలను పంచాయతీలు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేస్తాం. వనాల్లో పెరిగిన చెట్ల కొమ్మలను తొలిగించేలా వెంటనే చర్యలు చేపడతాం. వనాలపై పంచాయతీల పర్యవేక్షణ మరింత పెంచుతాం.

– ఎం.యర్రయ్య, ఎంపీడీఓ

మధ్యాహ్న భోజన నాణ్యతలో రాజీపడొద్దు

నేలకొండపల్లి: విద్యార్థినులకు మధ్యాహ్నం అందించే భోజన నాణ్యతలో ఎటువంటి రాజీపడొద్దని, మెనూ కచ్చితంగా అమలు చేయాలని ఎంపీడీఓ ఎం.యర్రయ్య సూచించారు. మండలంలోని సింగారెడ్డిపాలెం సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను బుధవారం సందర్శించి వంట గదులు, కూరగాయల నాణ్యత, శానిటేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేసి ఏజెన్సీ వారికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బి.చలపతిరావు, గురుకుల ప్రిన్సిపాల్ ఎం.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.




వంటలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

దేశంలో ‘ఒకే ఎన్నిక’ విధానం వద్దు

తిరుమలాయపాలెం: దేశంలో ఒకే ఎన్నిక విధానాన్ని సరైంది కాదని, ప్రజాస్వామ్య పద్ధతిలో జరుగుతున్న ఎన్నికల విధానంలోనే కొనసాగించాలని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డీవైఎఫ్ఐ) ఖమ్మం జిల్లా కార్యదర్శి షేక్.బషీరుద్దీన్ అన్నారు. బుధవారం తిరుమలాయపాలెం గజ్జల వెంకటయ్య భవనంలో డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు దిండు మంగపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విధానాన్ని అభ్యుదయ వాదులు, ప్రజాతంత్ర వాదులు, విద్యార్థులు యువకులు, ప్రజలు వ్యతిరేకించాలన్నారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి దాసరి మహేందర్, మండల నాయకులు సురేష్, దోనేపల్లి వినయ్, వెంకటేష్, జానీమియా, గోపి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు సొసైటీ సభ్యత్వాలు



జర్నలిస్టులకు సభ్యత్వాలు అందిస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: సీనియారిటీ ప్రాధాన్యతతో ఖమ్మం నియోజకవర్గ జర్నలిస్టులకు సభ్యత్వాలు అందిస్తున్నట్లు స్తంభాద్రి జర్నలిస్ట్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్ష, కార్యదర్శులు కనకం సైదులు, బొల్లం శ్రీనివాస్‌లు తెలిపారు. బుధవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్టులకు హౌసింగ్ సొసైటీ సభ్యత్వాలు అందించిన సందర్భంగా వారు మాట్లాడారు. సొసైటీ నియమ నిబంధనల మేరకు వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వబడతాయని, అక్రిడిటేషన్‌తో పాటు గత సీనియారిటీని పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోల రాంనారాయణ, టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ, టీయూడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు పల్లా కొండలరావు, సొసైటీ ఉపాధ్యక్షుడు మైసా పాపారావు, కోశాధికారి వెన్నబోయిన సాంబశివరావు, డైరెక్టర్లు, యూనియన్ల నేతలు పాల్గొన్నారు.

జీవనభృతి అందించాలి

తిరుమలాయపాలెం: వ్యవసాయ కూలీలకు జీవన భృతి కింద రూ.12 వేలు చెల్లించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి బందెల వెంకయ్య అన్నారు. మండలంలోని పిండిప్రోలు గ్రామంలో పాలేరు డివిజన్ అధ్యక్షుడు సోమనపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై ఈనెల 20 నుంచి డిసెంబర్ 2 వరకు విస్తృతంగా ఆందోళన కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు పాలేరు డివిజన్ కార్యదర్శి యాదగిరి, నాయకులు ఉప్పలయ్య, వెంకటఅప్పారావు, యోహాను తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఎర్రజెండా

రఘునాథపాలెం: పేదల సమస్యలపై పోరాడుతూ వారికి అండగా నిలిచేది ఎర్రజెండా మాత్రమేనని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పంగిడి, ఈర్లపుడి తదితర గ్రామాల్లో బుధవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. శత వసంత ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రావణ్, శివనాయక్, బానోత్ రవి, జామ్లా నాయక్, రామా నాయక్, శ్రీను, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల ఆవిష్కరణ

ఖమ్మంసహకారనగర్: ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య 98వ జయంతి సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 35 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఆయన రాసిన విద్యారంగ పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్స్ సంఘం నాయకుడు కే.ఎస్.రామారావు తెలిపారు. మొదటి పాఠం, ఓనమాలు, జ్ఞాపకాలు, నడక, బడి పంతుళ్లకు రాజకీయాలు, లెక్కలతో నా ప్రయోజనాలు తదితర పుస్తకాలను ఆవిష్కరించినట్లు తెలిపారు.

జరిమానా

ఖమ్మంమయూరిసెంటర్: ఖాళీ ప్లాట్‌లో పిచ్చి మొక్కలు, చెత్త ఉందని, శుభ్రం చేయాలని మున్సిపల్ అధికారులు గతంలో స్థల యజమానికి నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో జరిమానా విధించిన సంఘటన ఇది. నగర పాలక సంస్థ పరిధిలోని 16 డివిజన్ శ్రీరామ్‌నగర్ రోడ్ నంబర్ 14లో ఉన్న ఖాళీ స్థలం అపరిశుభ్రంగా ఉండడంతో ఈనెల 8న స్థల యజమానికి అధికారులు నోటీసు ఇచ్చారు. అయినా స్పందించకపోవడంతో బుధవారం రూ.10 వేల జరిమానా విధించారు.

బాధ్యతల స్వీకరణ

ఖమ్మంరూరల్: రూరల్ ఎస్ఐగా 2020 బ్యాచ్‌కు చెందిన విశ్వతేజ బుధవారం బాధ్యతలు చేపట్టారు. వరంగల్ సుబేదారి, మహబూబాబాద్, గూడురులలో ఎస్ఐగా విధులు నిర్వర్తించి గూడురు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ప్రజల సహకారంతో శాంతి భద్రతలు కాపాడతానన్నారు. అనంతరం సీఐ ముష్క రాజును మర్యాదపూర్వకంగా కలిశారు.

వికసిత్ భారత్‌లో భాగస్వాములు కండి

ఖమ్మం మామిళ్లగూడెం: వికసిత్ భారత్‌లో భాగస్వాములు కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, అధికార ప్రతినిధి దనియాకుల వెంకటనారాయణ యాదవ్ కోరారు. బుధవారం ఖమ్మం 53వ డివిజన్‌లో వెయ్యి సభ్యత్వాలు పూర్తి చేసిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సన్నె ఉదయ్‌ప్రతాప్, గెంటేల విద్యాసాగర్, బూత్ అయ్యక్షులు, డివిజన్ కాంటెస్ట్ కార్పొరేటర్ డి.శ్రీలత, రవీందర్, వీరభద్రం, ఉపేంద్ర, మల్లికార్జున్, షేక్ ఆసిఫ్, సుబ్రమణ్యం, శీలం పాపారావు, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అంజయ్య, సరస్వతి పాల్గొన్నారు.

బౌద్ధక్షేత్రంలో వివాహం

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని బౌద్ధక్షేత్రంలో నేలకొండపల్లికి చెందిన నాగరాజు–శిరీషల వివాహం బౌద్ధ సంప్రదాయ పద్ధతుల్లో బుధవారం వివాహం జరిగింది. వీరి వివాహాన్ని బౌద్ధ ఉపాసకులు హెచ్.బసవయ్య, పత్తిపాటి వెంకటేశ్వర్లు, పెద్దపాక వెంకట్‌లు జరిపించారు. ఈ సందర్భంగా బౌద్ధ భిక్షు సద్దారక్కిత మాట్లాడగా.. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ, ప్రకృతి వైద్య నిపుణుడు డాక్టర్ రామచంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములుతో పాటు నాయకులు సుధాకర్, నాగరాజు, నాగేశ్వరరావు, ఈదయ్య, ఆనందరావు, వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌కో ఏఈ కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డుకు మరమ్మతులు చేయాలి

కామేపల్లి: మండలంలోని పింజరమడుగు నుంచి తాళ్లగూడెం వరకు బీటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని బుధవారం సీపీఎం మండల పార్టీ ఆధ్వర్యాన పాదయాత్ర నిర్వహించి తాళ్లగూడెం బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు దుగ్గి కృష్ణ మాట్లాడుతూ మండలంలో బీటీ రోడ్లు మరమ్మతులకు గురై పరిస్థితి దారుణంగా ఉందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంబటి శ్రీనివాసరెడ్డి, ఇంజం నాగభూషణం, కిన్నెర రామచంద్రయ్య, డేగల రాంబాబు, వినుకొండ నాగేశ్వరరావు, వేల్పుల శాంతయ్య, సతీష్, శివ, సాయి, వెంకటేశ్వర్లు, తాళ్లూరి జనార్దన్, వెంకటయ్య పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూళ్లు జరగాల్సిందే..

రఘునాథపాలెం: గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు కులగణన సర్వేను నిర్వహిస్తూనే మరోపక్క ఇంటి పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలని ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం సర్వే తీరుపై ఆరా తీసి, బూడిదంపాడులో ఇంటి పన్నుల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ కొనసాగించారు. మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో మొత్తం ఈ నెల చివరి నాటికి రూ.60 లక్షలు వసూళ్లు కావాల్సి ఉండగా.. ఇప్పటి వరకు రూ.35లక్షలు వసూళ్లు అయినట్లు తెలిపారు. మొత్తంగా రూ.1.10 కోట్ల ఇంటి పన్నులు వసూళ్లు కావాల్సి ఉందని, లక్ష్యం మేర వసూళ్లకు చొరవ తీసుకోవాలన్నారు.

సర్వేపై కమిషనర్ ఆరా..

ఖమ్మంమయూరిసెంటర్: సమగ్ర సర్వేకు సంబంధించిన అంశాలపై గురువారం కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య కేఎంసీ కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లు సర్వే ఏవిధంగా చేస్తున్నారో వారు నమోదు చేసిన ఫారాలు, రిజిస్టర్లను పరిశీలించారు. ఫామ్స్ ఎక్కడా నిరుపయోగంగా పడేయకుండా.. జాగ్రత్తగా ఉపయోగించాలని అధికారులను ఆదేశించారు.



సర్వే వివరాలను పరిశీలిస్తున్న కేఎంసీ కమిషనర్

‘ఉపాధి’పై అవగాహన

ఖమ్మం సహకారనగర్/ఖమ్మంరాపర్తినగర్: నగరంలోని ఏఎస్ఆర్ శాంతినగర్ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధికారిణి ఎస్. మాధవి మాట్లాడుతూ భవిష్యత్‌లో ఏ రంగాన్ని ఎంచుకోవాలన్న ముందుగా ఇంటర్ పాఠ్యాంశాలపై పట్టు సాధించాలని, ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసిన తర్వాత వివిధ రంగాలలో ఎంచుకోవాల్సిన ఉపాధి మార్గాలపై ఆమె వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐటీలో సదస్సు

ఖమ్మం సహకారనగర్: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై ఖమ్మం ఎస్‌బీఐటీ కళాశాలలో సదస్సు బుధవారం ప్రారంభమైంది. ఐసీటీ అకాడమీ, హనీవెల్ సంయుక్తంగా నిర్వహించే 15 రోజుల సదస్సులో కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడారు. భవిష్యత్‌ను శాసించనున్న ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, అకడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, ఏవీవీ.శివప్రసాద్, గుండాల ప్రవీణ్‌కుమార్, రవీంద్రబాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

23న చెరుకు రైతుల రాష్ట్ర సదస్సు

నేలకొండపల్లి: తెలంగాణ చెరుకు రైతుల రాష్ట్ర సదస్సును ఈ నెల 23న నేలకొండపల్లిలో నిర్వహిస్తున్నట్లు చెరుకు రైతుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రచ్చా నరసింహారావు తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరుకు టన్ను ధర రూ. 4 వేలు ప్రకటించాలని, చెరుకు ఫ్యాక్టరీకి సరఫరా చేసిన 10 రోజుల్లోనే రైతులకు బిల్లులు చెల్లించాలన్నారు. రైతు సంఘం నాయకులు జి.నాగేశ్వరరావు, ఇంటూరి అశోక్, రాజు పాల్గొన్నారు.

25 నుంచి ఐద్వా సదస్సులు..

ఖమ్మం మామిళ్లగూడెం: మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ఈ నెల 25 నుంచి వచ్చే నెల 9 వరకు గ్రామ, మండల స్థాయిలో సదస్సులు నిర్వహించాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి బుగ్గవీటి సరళ, కోశాధికారి మాచర్ల భారతి కోరారు. బుధవారం ఖమ్మం సుందరయ్యభవన్‌లో మెరుగు రమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. డిసెంబర్ 10న మానవ హక్కుల దినోత్సవం జరపాలని కోరారు. జిల్లా కార్యదర్శి బండి పద్మ, నాగసులోచన, మెహరున్నిసా బేగం, కరుణ, సుమతి, అమరావత, సునిత, రజిత, జ్యోతి, అజిత, అరుణ, కృష్ణవేణి, విజయ,సుగుణమ్మ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు మాట్లాడుతూ.. కళాశాలలో బోధన మెరుగుపరిచేందుకు ఈ ప్రోగ్రామ్ నిర్వహించినట్లు తెలిపారు. మెడికల్ ఎడ్యుకేషన్‌తో పాటు వివిధ అంశాలపై కళాశాలలో బోధన సిబ్బందికి వరంగల్ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎస్‌వీఆర్ రెడ్డి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం కళాశాలకు చెందిన గైనిక్ హెచ్‌ఓడీ యామిని, అసోసియేట్ ప్రొఫెసర్ మసూద్ పాషా, టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



దయాకర్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్: అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ సీపీఎం మండల నాయకులు మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డికి బుధవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు పి.మోహన్‌రావు మాట్లాడుతూ.. రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలని, గ్రామాల్లో వేస్తున్న ఇందిరమ్మ కమిటీల్లో అన్ని పార్టీలకు ప్రాధాన్యతనివ్వాలని, అందులో మండలానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని దయాకర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.వెంకన్న, డి.పాపయ్య, పి.ఉపేందర్, ఎం.రాజశేఖర్, జలగం వెంకట్రావు, వేగినాటి ఫ్రాన్సిస్, బోళ్ల గురునాథం తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

ఖమ్మంలీగల్/ఖమ్మంమామిళ్లగూడెం: వచ్చే నెల ఒకటిన సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో నిర్వహించే మాలల సింహగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని ఐఎంఎల్ఏ అధ్యక్ష, కార్యదర్శులతోపాటు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ రాష్ట్ర కోచైర్మన్, ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ గోసోజు రమేష్, జిల్లా కన్వీనర్ వీరభద్రం పిలుపునిచ్చారు. బుధవారం కోర్టు ఆవరణలో ఐఎంఎల్ఏ ఆధ్వర్యంలో.. అంబేడ్కర్ భవన్‌లో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో రెంటాల ఆనంద్, పీఏజే శేఖర్‌రాజు, గోరింట్ల శాంతారావు, మద్దెల వెంకటేశ్వర్లు, బాజీ జాళావతిభాస్కర్, కొప్పుల కృష్ణ, రవి, పి.చందు, లింగాల రవికుమార్, దామల్ల సత్యనారాయణ, చిరంజీవి, జాకబ్ ప్రతాప్, బాబూరావు, కనకరాజు, వెంకటేశ్వర్లు, దయానంద్, సుధాకర్, కాంతయ్య, పుష్పరాజ్, భాస్కర్, పాల్గొన్నారు.

మాజీ మంత్రి పర్యటనను..

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు నగరంలో రెండు రోజుల పాటు పర్యటించనుండగా.. జయప్రదం చేయాలని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు పిలుపునిచ్చారు. బుధవారం మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో నాగరాజు మాట్లాడారు. కూరాకుల నాగభూషణం, ఆర్‌జేసీ కృష్ణ, కర్నాటి కృష్ణ, నాగండ్ల కోటేశ్వరరావు, మక్బుల్, శీలంశెట్టి వీరభద్రం, వలరాజు, జశ్వంత్, నాగేశ్వరరావు, రాంమోహన్‌రావు, పాల్గొన్నారు.

యాదవ వనసమారాధనను..

ఖమ్మంఅర్బన్: జిల్లా అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఈ నెల 24 ఆదివారం చెరుకూరు గార్డెన్స్‌లో జరిగే యాదవ వనసమారాధనను విజయవంతం చేయాలని కోరుతూ ప్రచారజాతా వాహనాన్ని బుధవారం మేకల మల్లిబాబుయాదవ్, చిలకల వెంకటనరసయ్య, చిత్తారు సింహాద్రి ప్రారంభించారు. నాగేశ్వరరావు, కోటయ్య, రమణ, విజయలక్ష్మి, భూపతి, ప్రభాకర్, పద్మ, రాగం ప్రభాకర్, కన్నెబోయిన రవి, పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీని..

నేలకొండపల్లి: లగచర్ల బాధితుల కోసం గురువారం చేపట్టనున్న కొవ్వొత్తుల ర్యాలీని జయప్రదం చేయాలని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడగా.. ప్రధాన కార్యదర్శి వెన్నబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మెటీరియల్ పంపిణీ

ఖమ్మంగాంధీచౌక్: లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యంలో బుధవారం గొల్లగూడెం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలకు సంబంధించిన మెటీరియల్, పెన్నులు, కాంపాస్ బాక్స్‌లను అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు మాట్లాడగా కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సెక్రటరీ గెల్లా శ్రీరామ్, డాక్టర్ డీపీసీ రావు, విశ్వేశ్వరరావు, దుర్గ నాగేశ్వరరావు, వెంకయ్య, హెచ్ఎం ప్రమీల, రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటలు, వ్యాసరచన, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అంతేకాక గ్రంథాలయంలో చదివి గ్రూప్–4, ఏఈ ఎక్సైజ్ శాఖలలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం అర్బన్ ఎంఈఓ వీరాస్వామి, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, శాంతినగర్ హైస్కూల్ హెచ్ఎం డానుబోస్కో, గ్రంథాలయ కార్యదర్శి వి.అర్జున్, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం యూనియన్ అధ్యక్షుడు రాజు, కార్యదర్శి ఇమామ్, గ్రంథాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

‘టైనిటాట్స్’ ప్రతిభ

ఖమ్మం సహకారనగర్: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని టైనిటాట్స్ కరస్పాండెంట్ శెట్టి భాస్కర్ తెలిపారు. బుధవారం ప్రతిభ కనబర్చిన విద్యార్థులు సల్మాన్, శ్రీనిత్య, అప్సర్ మున్నిసా, జ్యోతిక, ఐస్‌సన్, మదీహ సుఫియాన్, నాగచైతన్య, భువనచంద్రిక తదితరులు ప్రతిభ కనబర్చారని పేర్కొని వారిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, నసీర, పర్వీన్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి అందిస్తున్న దృశ్యం